క్లుప్తంగా

కుమారస్వామికి షష్టి పూజలు


కుమారస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో షష్టిని పురస్కరించుకుని ఆదివారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

పగిడ్యాల: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై కక్షపూరిత ధోరణితో ఆయనను అంతం చేయాలనే దురుద్దేశంతో రాళ్లతో దాడి చేయడం హేయమైన చర్యఅని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పుల్యాల నాగిరెడ్డి అన్నారు. ఆదివారం పగిడ్యాలలోని ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ పేదలకు మంచిచేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని చూసి ఓర్వలేక చంద్రబాబు అండ్‌కో హత్యారాజకీయాలకు పూనుకోవడం తగదన్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు భూశిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, సర్పంచ్ పెరుమాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

మహానంది: పెళ్లైన తొమ్మిది నెలలకే అదనపు కట్నం కోసం భర్త వేధిస్తున్నాడని గాజులపల్లెకు చెందిన వరలక్ష్మి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు బాధితురాలి భర్త బేతంచర్లకు చెందిన అజయ్‌కుమార్‌పై 498ఏ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

మహానంది: గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని మహానంది ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ హెచ్చరించారు. బొల్లవరం గ్రామంలో ఆదివారం రాత్రి పోలీసులు దాడులు నిర్వహించి మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.

విద్యుత్ సరఫరాలో మార్పు

మహానంది: సోమవారం త్రీ ఫేస్ సరఫరా వేళల్లో మార్పు ఉంటుందని ఏఈ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. పుట్టుపల్లె ఫీడర్ ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, అబ్బీపురం ఫీడర్ ఉదయం 4 నుంచి ఏడు గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 వరకు, కృష్ణనంది ఫీడర్ ఉదయం 5 నుంచి 9 వరకు, మధ్యాహ్నం 3 నుంచి 6 వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం


అగ్నిమాపక పరికరాల గురించి వివరిస్తున్న అగ్నిమాపక అధికారి భీముడు

ఆత్మకూరు: పట్టణంలో ఆదివారం అగ్నిమాపక వారోత్సవాలు స్థానిక అగ్నిమాపక కేంద్రంలో అగ్నిమాపక అధికారి భీముడు ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అగ్నిమాపక పరికరాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ హరి పాల్గొని అగ్నిమాపక పరికరాలు, రెస్క్యూ పరికరాలు, కరపత్రాల స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఓంకారంలో భక్తుల సందడి

మహానంది: బండిఆత్మకూరు మండలం ఓంకారం పుణ్యక్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి కనిపించింది. సెలవురోజు కావడంతో పలు ప్రాంతాల భక్తులు ఆలయానికి చేరుకుని శ్రీ గంగ, ఉమా సమేత ఓంకార సిద్ధేశ్వర స్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, అర్చన పూజలు చేపట్టారు. అనంతరం భక్తులు స్థానిక కాశినాయన అన్నపూర్ణ ఆశ్రమం వద్ద అన్నప్రసాదాలు స్వీకరించారు.

నాటుసారా స్వాధీనం

మిడుతూరు: మండల పరిధిలోని చౌట్కూరు గ్రామ శివారుల్లో గుమితంతండా గ్రామానికి చెందిన బాలాజీ నాయక్ వ్యక్తి నుంచి 30 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ జగన్‌మోహన్ ఆదివారం తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు.

మినహాయింపు ఇవ్వాలి

నంద్యాల(న్యూటౌన్): వివిధ సమస్యలపై బాధపడుతున్న ఉపాధ్యాయులకు, 40శాతం పైబడిన దివ్యాంగులకు సాధారణ ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని పీఆర్టీయూ జిల్లా సెక్రటరీ భాస్కరరెడ్డి, అధ్యక్షుడు రామపక్కీర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆదివారం జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

ప్రజాదరణను చూసి ఓర్వలేకనే సీఎంపై హత్యాయత్నం

- ఏపీ శాప్ చైర్మన్ సిద్ధార్థరెడ్డి
- సీఎం వైఎస్ జగన్‌పై దాడి దారుణం
- చంద్రబాబు హత్యా రాజకీయాలు నశించాలి


మాట్లాడుతున్న శాప్ రాష్ట్ర చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

నందికొట్కూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన బస్సు యాత్రకు వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు టీడీపీ గూండాలతో దాడులు చేయించడం దారుణమని ఏపీ శాప్ చైర్మన్, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని 2వ వార్డులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం వైఎస్ జగనన్నకు వస్తున్న ఆదరణను జీర్ణించుకోలేక చంద్రబాబు దుర్మార్గమైన ఆలోచనలు చేయడం తగదని హెచ్చరించారు. దేవుడి దయతో, ప్రజల ఆశీస్సులతో జగనన్న క్షేమంగా ప్రాణాల నుంచి బయట పడ్డారని చెప్పారు. అధికారం కోసం జగనన్నను హతమార్చేందుకు బాబు కుట్ర పన్నితే చూస్తూ సహించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. చాలా రోజుల నుంచి ప్రతిపక్షాలు ఏ సమావేశంలో మాట్లాడినా మా ప్రభుత్వం వచ్చిందంటే నీ అంతు చూస్తాం, నిన్ను కేసులలో ఇరికిస్తాం, నీపై దాడుల చేస్తాం, రెడ్ బుక్‌లలో రాసుకున్నామని బెదరించిన సందర్భాలెన్నో ఉన్నాయని గుర్తు చేశారు. దాడి జరిగి గాయమైతే కూడా చంద్రబాబు డ్రామా అని చెప్పడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. కుట్రలతో అధికారంలోకి రావాలని చూస్తున్న కూటమికి ప్రజలే గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా మళ్లీ సీఎం జగనన్ననేని ధీమా వ్యక్తం చేశారు. దాడిపై ఎలక్షన్ కమిషన్, పోలీసులు లోతుగా విచారణ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కౌన్సిలరు చాంద్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిపై హత్యాయత్నం అమానుషం


నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

ఆత్మకూరు: విజయవాడ నగరంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన దాడి అమానుషమని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి అన్నారు. పట్టణంలోని పాత బస్టాండు వద్ద ఆదివారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ నాయకులు ముఖ్యమంత్రిపై పన్నిన కుట్ర అని, భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ స్ఫూర్తితో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగు, బలహీనవర్గాల ప్రజలకు పెద్దపీట వేసి సంక్షేమ పథకాలను అందిస్తున్నారని చెప్పారు. అలాంటి ముఖ్యమంత్రిపై పచ్చ పార్టీలు కుట్ర పన్ని దాడి చేయడం సిగ్గుచేటన్నారు. 2019లో సీఎం అయిన అనంతరం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేనివిధంగా విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చి ఐక్యరాజ్య సమితిలోనే మన రాష్ట్రానికి గుర్తింపు తెచ్చారన్నారు. అలాంటి ముఖ్యమంత్రి ప్రజల పక్షాన ప్రచారానికి వెళ్తే దాడి చేయించడం హేయమైన చర్య అని, ఇది టీడీపీ నాయకులు చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్ పన్నిన కుట్రలో భాగమని ఆరోపించారు. ఈ ఘటనను ప్రతిఒక్కరూ ఖండించాలన్నారు. అంతకముందు పార్టీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు యూనుస్, పట్టణ, మండలాధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, పువ్వాడి భాస్కర్, అంజాద్‌అలీ, బాలుస్వామియాదవ్, కోట్ల నాగేశ్వరరెడ్డి, శివశంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌పై హత్యాయత్నం టీడీపీ కుట్రే

మహానంది: సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం ముమ్మాటికీ టీడీపీ కుట్రలో భాగమేనని మహానంది, బండిఆత్మకూరు మండలాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై రాయితో దాడి ఘటనపై ప్రజాప్రతినిధులు, నాయకులతో పాటు సాధారణ ప్రజలు, మహిళలు ఆదివారం ఆవేదన వ్యక్తం చేస్తూనే మండిపడుతున్నారు.

ఓటమి భయంతో కూటమి కుట్రలు

కూటమి పార్టీలకు ఓటమి భయం పట్టుకుందని, అందుకే కుట్రలు పన్నుతున్నారని మహానంది, బండిఆత్మకూరు మండలాల అధ్యక్షులు కొమ్మా మహేశ్వరరెడ్డి, బారెడ్డి శ్రీనివాసరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఓడిపోతామని అనేక కుట్రలకు పాల్పడుతున్నారన్నారు. ఇటీవల వలంటీర్ల వ్యవస్థపై కేసులు వేసి వారి వలలో వారే ఇరుక్కుపోయినా ఇంకా మార్పు రాకపోవడం సిగ్గుచేటన్నారు. దాడికి పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

సాక్షాత్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై దాడి జరగడం బాధాకరమని, ప్రజాదరణ చూసి ఓర్వలేక ఇలాంటి దుశ్చర్యకు పాల్పడ్డారని బండిఆత్మకూరు మండల మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి తెలిపారు. బండిఆత్మకూరులో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఎంతో ప్రజాభిమానం పొందిన ముఖ్యమంత్రుల్లో జగన్‌మోహన్‌రెడ్డి ఒకరని, ఇది నీచమైన చర్య అంటూ మండిపడ్డారు. ఏదైనా ఎన్నికల్లో ఎదుర్కోవాలని కానీ ఇలాంటి దాడులకు పాల్పడటం తగదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అవుటాల నాగేశ్వరరెడ్డి, కృష్ణమల్లారెడ్డి వైఎస్సార్‌సీపీ యూత్ వింగ్ ప్రెసిడెంట్ దీపుకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


బండిఆత్మకూరులో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి , వైఎస్సార్‌సీపీ నాయకులు

గ్రామాల్లోనూ టీడీపీ నేతల కదలికలపై నిఘా ఉంచాలి

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో టీడీపీ నేతల కదలికలపై గ్రామాల్లోనూ పోలీసులు నిఘా ఉంచాలని మహానంది మండల ఉపాధ్యక్షురాలు కుంచపు లక్ష్మీనరసమ్మ కోరారు. అన్ని వర్గాల వారి అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న సంక్షేమ సారథి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై దాడి చేయడం సిగ్గుచేటన్నారు. బస్సుయాత్ర చేస్తుంటే వస్తున్న ఆదరణ చూసి ప్రతిపక్ష పార్టీల వారికి కడుపు మంటగా ఉందన్నారు. సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రిపై దాడి చేసి వైఎస్సార్‌సీపీ నేతలను భయభ్రాంతులకు గురి చేయాలన్న కుట్రతో దాడి చేసినట్లున్నారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో కూటమి పార్టీలకు గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

చంద్రబాబుది నీచ రాజకీయం


సమావేశంలో మాట్లాడుతున్న రాఘవరెడ్డి

వెలుగోడు: ప్రతిపక్ష నేత చంద్రబాబుది నీచ రాజకీయమని వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు యూనిస్, మండల ఇన్‌చార్జ్ రాఘవరెడ్డి మండిపడ్డారు. సీఎం జగన్‌పై జరిగిన హత్యాయత్నాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ఆదివారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. మేమంతా సిద్ధం బస్సు యాత్రలో సీఎం వైఎస్ జగన్‌కు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక దాడికి పాల్పడ్డారని, ఇది పిరికిపంద చర్యగా అభివర్ణించారు. దాడి చేయించడమే కాకుండా సిగ్గులేకుండా లోకేష్, అచ్చెన్నాయుడు, చంద్రబాబు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఎన్నికల కోసం డ్రామాలాడే అలవాటు చంద్రబాబుదేనన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, మండల కార్యదర్శి కే. రామ్మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ చాంద్‌బాషా, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, నాయకులు షంషీర్ అలీ, తెలుగు రాజు, శ్రీను, మహ్మద్‌ఖాన్, గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి అండగా ఉంటాం


మృతుని కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

పాములపాడు: హత్యకు గురైన శెట్టి ప్రతీప్ కుటుంబానికి అండగా ఉంటామని రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని చెలిమిల్ల గ్రామంలో మృతుని ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లలను బాగా చదివించాలని, అందరూ ధైర్యంగా ఉండాలని, మేమంతా తోడుగా ఉంటామని భరోసా కల్పించారు. ఆ కుటుంబానికి ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక సహకారం త్వరగా అందేలా కృషి చేస్తానని తెలిపారు. మృతుని చిత్రపటం వద్ద పూలు వేసి నివాళ్లులర్పించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి, విజయసింహారెడ్డి, సర్పంచు కోట్ల చంద్రారెడ్డి, ఎంపీటీసీ సురేష్, కో ఆప్షన్ ముర్తుజావలి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

జగనన్న పాలన సంక్షేమానికి చిరునామా


ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న దారా సుధీర్

నందికొట్కూరు రూరల్ : ప్రతి పేదవానికి సంక్షేమ పథకాలను అందించిన ఏకైక సీఎం జగనన్న అని నందికొట్కూరు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్ అన్నారు. శనివారం మండల పరిధిలోని బిజినవేముల గ్రామంలో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు, సర్పంచ్ రవియాదవ్ ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు ఆయన స్వగృహంలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయండి....

రాష్ట్రంలో జగనన్న పాలన సంక్షేమానికి చిరునామాగా నిలిచిందని బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయంగా సీఎం జగనన్న లక్ష్యమని దారా సుధీర్ అన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగనన్నపై రాళ్లదాడికి నిరసనగా నల్లరిబ్బన్ కట్టుకుని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, సింగిల్ విండో చైర్మన్లు సతీష్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ పబ్బతి రవి, జేసీఎస్ కన్వీనర్ ఓంకార్ రెడ్డి, నాయకులు అశోక్‌రెడ్డి, తువ్వా శివరామకృష్ణారెడ్డి, సగినేల ఉశేనయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రచార జోరు


ప్రచారం నిర్వహిస్తున్న మండల అధ్యక్షుడు పుల్యాల నాగిరెడ్డి

పగిడ్యాల: స్థానిక కుంట వీధిలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పుల్యాల నాగిరెడ్డి ఆదివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి విశేష స్పందన లభించింది. మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రిని చేసుకుందామని ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపైనే నొక్కాలని ఓటర్లకు సూచించారు. నందికొట్కూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా విద్యావంతుడు, వైద్య వృత్తిలో ఎందరికో సేవలు అందించి జగనన్న పిలుపు మేరకు ప్రజాసేవ కోసం వచ్చిన దారా సుధీర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి మారోసారి సత్తాచాటుదామని ఓటర్లకు పిలుపునిచ్చారు. ఓటర్లను చిరునవ్వుతో పలుకరిస్తూ జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాల కరపత్రాలను పంచుతూ ప్రచారాన్ని కొనసాగించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు భూషిరెడ్డి, బొబ్బిటి బాబురెడ్డి, మాజీ డైరెక్టర్ శేషన్న, పల్లె సత్యనారాయణరెడ్డి, భాస్కరరెడ్డి, మద్దిలేటి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలో ఐదేళ్లూ కరువే


కుమ్మరిపేటలో ఎన్నికల ప్రచారం చేస్తున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

నందికొట్కూరు: టీడీపీ అధినేత చంద్రబాబు పాలనలో ఐదేళ్లూ కరువుతో ప్రజలు అల్లాడిపోయారని శాప్ రాష్ట్ర చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి గుర్తు చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన దాడికి బ్లాక్ రిబ్బన్స్‌తో నిరసన తెలుపుతూ ఆదివారం పట్టణంలోని కుమ్మరిపేటలో ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం వైఎస్ జగనన్న ఇచ్చిన హామీలలో 99 శాతం అమలు చేశారని ప్రజలకు వివరించారు. మళ్లీ జగనన్నను సీఎంగా ఆశీర్వాదించాలని కోరారు. సిద్ధార్థ మాట్లాడుతూ.. 2014–2019 వరకు చంద్రబాబు పాలనలో వర్షాలు కురవక రైతులు వేసిన పంటలు ఎండిపోయి అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. మహిళలకు తీసుకున్న రుణాలు మాఫీ చేస్తానని మోసం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందని గుర్తు చేశారు. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలు సిఫారసు చేసిన వారికి మాత్రమే పింఛన్లు ఇచ్చేవారన్నారు. సీఎం జగనన్న పాలనలో అర్హత ఉన్న వారందరికీ పైసా లంచం లేకుండా పింఛన్లు మంజూరు చేశారని చెప్పారు. ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటువేసి నందికొట్కూరు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డిని ఆశీర్వాదించాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, కౌన్సిలర్లు చాంద్‌బాషా, లాలు, చిన్నరాజు, సురేష్, నాయబ్, రవూఫ్, గఫార్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మన్సూర్, విజయకుమార్, విజ్జి, ఉపేంద్రారెడ్డి, జబ్బార్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అందరివాడు

- శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి
- ఊరూరా అంబేడ్కర్ జయంతి సంబరాలు


నందికొట్కూరులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సిద్ధార్థరెడ్డి, దారా సుధీర్


కొత్తపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

నందికొట్కూరు: భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందరివాడని శాప్ రాష్ట్ర చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్ అన్నారు. ఆదివారం అంబేడ్కర్ జయంతిని ఊరూరా వేడుకగా జరుపుకున్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సీఎం చిత్ర పటానికి, కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారిపై, మున్సిపాలిటీలోని అంబేడ్కర్ విగ్రహాలకు శాప్ చైర్మన్ సిద్ధార్థరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి సుధీర్‌తో పాటు మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మద్దూరు సతీష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు చాంద్‌బాషా, లాలు, సురేష్, చిన్నరాజు, రవూఫ్, హమీద్, కృష్ణ తదితరులు నివాళులర్పించారు. అలాగే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో, కళాశాల్లో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రమౌళి, ఎన్. వెంకటరెడ్డి, అబుబక్కర్, జబ్బార్, రామకృష్ణ, ఓంకార్‌రెడ్డి, అర్జ్ శ్రీను, కుర్వ శ్రీను, భాస్కర్‌రెడ్డి, ఉపేంద్రారెడ్డి, గోవిందారెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్, పబ్బతి రవి, బ్రహ్మయ్య, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆదివారం మండలంలోని తుమ్మలూరు, పాములపాడు గ్రామాల్లో విగ్రహాలకు రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి పూల మాలలు వేసి నివాళ్లులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి, మాజీ సర్పంచు విజయసింహారెడ్డి, సర్పంచు వరప్రసాద్, ఎంపీటీసీ బషీర్ అహ్మద్, సొసైటీ చైర్మన్ చౌడయ్య, జేసీఎస్ కన్వీనర్ నాగరాజు, నాయకులు పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి కస్టమ్స్ ఆఫీసర్ వేల్పుల ఆనంద్, డాక్టర్ నాగన్న పూల మాలలు వేసి నివాళ్లులర్పించారు. మాల మహానాడు నాయకులు అబ్రహాం, దేవభక్తుడు, అంకన్న పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండల కేంద్రంలో సెంట్రల్ కస్టమ్స్ అధికారి వేల్పుల ఆనంద్ కుమార్, జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, నాగంపల్లి సొసైటీ చైర్మన్ గౌరు జనార్దన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సుధాకర్‌రెడ్డి, గ్రామాల్లో సర్పంచ్‌లు, ప్రజానిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని నాగటూరు గ్రామంలో శనివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఎక్కలదేవి చంద్రమౌళీ, సింగిల్ విండో చైర్మన్‌లు సతీష్‌రెడ్డి, మహేశ్‌రెడ్డి, నాయకులు శివారెడ్డి, బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పగిడ్యాల: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను ఆదివారం మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో, ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్‌తో పాటు అన్ని గ్రామాల్లో ఘనంగా చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి, కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు పుల్యాల నాగిరెడ్డి, సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, ఎంపీటీసీ మిద్దె స్వాములు, వైఎస్సార్‌సీపీ నాయకులు భూషిరెడ్డి, పల్లె సత్యనారాయణరెడ్డి, బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: అంబేడ్కర్ అందరికీ ఆదర్శనీయుడని సర్పంచులు ప్రకాశం, నాగార్జునరెడ్డి, పీఎం నాగిరెడ్డి, నిర్మలమ్మ, ఎంపీటీసీ కృపాకర్, తెలిపారు. ఆదివారం అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని గ్రామసచివాలయాలు, జూపాడు బంగ్లాలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


ఆత్మకూరులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దాం

ఆత్మకూరు: భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దామని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రాజమోహన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పాత బస్టాండు వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు కోట్ల నాగేశ్వరరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రాజు, రవినాయ తదితరులు పాల్గొన్నారు. అలాగే దళిత సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో డా.నాగన్న, వెంకటస్వామినాయక్, సుదర్శన్, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు చిలకల రాబిన్‌సన్, మాల మహానాడు నాయకులు శీలం సురేష్, జవహర్‌నాయక్ తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలోని ధనుంజయ మీటింగ్ హాలులో నాయకులు యేసురత్నం, భాస్కర్, స్వాములు, సుధాకర్, శేఖర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని పాత బస్టాండు వద్ద కురువ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రంగస్వామి అంబేడ్కర్ సేవల గురించి వివరించారు.

శ్రీశైలంప్రాజెక్ట్: స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లోని విగ్రహానికి ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అసోసియేషన్ నాయకులు డాక్టర్.ఎం.శ్రీనివాసరావు, వి.లక్ష్మయ్య, జి.ప్రకాష్, పిల్లి.వెంకటేశ్వర్లు, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


వెలుగోడులో అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకుల నివాళి

వెలుగోడు: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ రాఘవ రెడ్డి, పార్టీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంఆర్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వాదం నాగేషులు, ఎస్ఎస్‌పీ జిల్లా నాయకులు బండి ఆరోగ్యం తదితరులు పాల్గొన్నారు.

మహానంది: బుక్కాపురం మజరా గ్రామమైన పుట్టుపల్లె గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు కందుల రఘురామిరెడ్డి, నలంద మహేశ్వరరెడ్డి, లక్ష్మీనాథరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పుట్టుపల్లె మల్లి, రమణ, బాలి, తదితరులు పాల్గొన్నారు. మహానంది సమీపంలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ కళాశాలలో అసోసియేట్ డీన్ డాక్టర్ వి. జయలక్ష్మి ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు.

మిడుతూరు: మండలపరిధిలోని నాగలూటి గ్రామ సచివాలయంలో సర్పంచ్ ఉషారాణి ఆధ్వర్యంలో ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పీరుసాహెబ్ పేట సహకార సొసైటీ అధ్యక్షుడు నాగతులసిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నబిరసూల్, పైపాలెం సర్పంచ్ రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు. వీపనగండ్ల గ్రామ ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. కస్టమ్స్ అధికారి వేల్పుల ఆనంద్ కుమార్, ఎంపీటీసీ కోటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సున్నిపెంటలో జోహార్లు అర్పిస్తున్న వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు


పుట్టుపల్లెలో అంబేడ్కర్ విగ్రహం వద్ద వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు


నాగటూరులో వైఎస్సార్‌సీపీ నాయకుల నివాళి


నాగలూటి సచివాలయంలో నివాళులర్పిస్తున్న దృశ్యం


జూపాడుబంగ్లాలో జోహార్లు అర్పిస్తున్న దృశ్యం